# ఫౌల్..ఫౌల్..!

## "మనం కోల్పోయిన యువరచయితలు"

మేం డిశెంబరు నెలలో ప్రచురించిన శ్రీ ఎన్నెస్. ప్రకాశరావు 'పేపర్ టైగర్', జనవరి నెలలో ప్రచురించిన శ్రీ శ్రీరంగం రాజేశ్వరరావు 'దేవుడు చూడని కథ' ల మీద అభినందిస్తూ పాఠకులనుంచి వచ్చిన అనేక ఉత్తరాలు మాకెంతో ఉత్సాహాన్నీ, ఉత్తేజాన్నీ ఇచ్చాయి. మంచి కథల గురించే పాఠకులు ఎదురు చూస్తారని చెప్పటానికి-ఇది ఉదాహరణ. ఎన్నెస్, రాజేశ్వరరావుల్లాగే పెద్దిరాజు కూడా మనకెవ్వరికీ కనిపించనంత దూరంగా వెళ్ళిపోయాడు. తెలుగు కథని సుసంపన్నం చేయవల బాధ్యత తమ యువతరం కథకుల మీదకి నెట్టేసి రాసిన అతి కొద్ది కథలకంటే మన మనసులో ఎప్పుడూ కదులుతారు వీరు. వాళ్ళని జ్ఞాపకాల్లో మిగుల్చుకుంటూ, వాళ్ళ రచనల్ని చదువుకుంటూ — 'ఆ స్ఫూర్తితో' — సమాజాన్ని వదలి సాము చెయ్యకుండా యువ రచయితలు దూసుకురావాలని, దూసుకొస్తారనీ ఆశిస్తున్నాం.

"లోకాన్ని పరికించి చూస్తే, అందులో ఎక్కువ్వాళ్లం అనుకునే వాళ్లే నిజానికి చాలా తక్కువ; తక్కువ్వాళ్లనిపించుకునేవారే ఎంతో ఎక్కువ తక్కువ్వారనబడే ఆ ఎంతో ఎక్కువ్వారికి మాత్రం, బతుకులో న్యాయం దొరకడంలేదు, జరగడంలేదు. పెద్దవారనబడేవారు వారి జీవితాలతో ఫౌలాట ఆడుతున్నారు కాబట్టే పేదవారి బతుకులు అథోగతికి పోతున్నాయి."

— రాచకొండ. విశ్వనాథశాస్త్రి.

